క్లుప్తంగా

వైభవంగా వేమాలమ్మ తీర్థం



ఆతవలో పూజలందుకుంటున్న వేమాలమ్మ తల్లి

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామదేవత వేమాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం వైభ వం గా నిర్వహించారు. గ్రామస్తులు సాయంత్రం అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే అరిగిపాలెంలో రెండోరోజు చుక్కమాంబ అమ్మవారి తీర్థం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వృత్తివిద్య కోర్సులతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న కార్తీక్, రమాకుమారి

మెరకముడిదాం: వృత్తి విద్య కోర్సుల్లో నైపుణ్యం సాధించే విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్ ఉంటుందని గర్భాం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ అన్నారు. పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులపై పదిరోజులుగా ఇస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఐసీఏ కంపెనీ జిల్లా కో–ఆర్డినేటర్ కార్తీక్, ఒకేషనల్ ట్రైనర్ రమాకుమారి పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన అవసరం



పెదవేమలిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గంట్యాడ: లెప్రసీ(కుష్టు) వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ కె.ఎర్రన్న అన్నారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు మండలంలోని పెద వేమలి గ్రామం లో సోమవారం ఇంటింట సర్వే చేయడంతో పాటు అవగాహన కల్పించారు. ఈసంద ర్భంగా ఎర్రన్న మాట్లాడుతూ శరీరంపై స్పర్శ, నొప్పి లేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు వాడాలని, అలసత్వం వహిస్తే అంగవైకల్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్‌ఎం పార్వతి, నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తా



శ్రీనివాసకుమార్

చీపురుపల్లి: వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ ఇంటలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొంచాడ శ్రీనివాస కుమార్ చెప్పారు. సోమవారం ఆయన చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంటలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనలతో పార్టీ అనుబంధ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

- డ్రిప్ ఇరిగేషన్‌తో సాగునీరు, శ్రమ ఆదా
- డ్రిప్, స్ప్రింకర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
- 90శాతం రాయితీపై పరికరాలు అందిస్తున్న ప్రభుత్వాలు
- విస్తరిస్తున్న సూక్ష్మ, బిందు సేద్యం



వేపాడ మండలంలోని వావిలపాడులో తుంపర సేద్యంతో పంటల సాగు

బిందు సేద్యంతో సాగు.. బహుబాగు



వేపాడ మండలంలోని కుమ్మపల్లిలో డ్రిప్ ద్వారా బొప్పాయి సాగు

వేపాడ: మారుతున్న కాలానికి అనుగుణంగా సులభ పద్ధతిలో వ్యవసాయం చేయడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఆధునిక పద్ధతులను అవలంభిస్తు న్నారు. అయితే తక్కువ పెట్టుబడే కాదు... తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని, తద్వారా శ్రమ, నీటిని ఆదా చేయ వచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నా రు.దీనికి రైతుల ముందున్న మార్గం బిందు, తుంపర సేద్యం(డ్రిప్ ఇరిగే షన్) అని అవగాహన కల్పిస్తున్నారు. రైతులను డ్రిప్ ఇరిగేషన్‌వైపు మళ్లించేందుకు ప్రభుత్వాలు కూడా ఎప్పటి నుం చే సబ్సిడీలు ఇస్తూ సంబంధిత పరికరాలను అందజేస్తున్నాయి. విద్యుత్ బోరు బావులున్న సన్న, చిన్న కారు రైతులకు 90శాతం రాయితీతో ప్రభుత్వం డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తోందని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,050 హెక్టార్లల్లో డ్రిప్ పరికాలు అమర్చాలని వ్యవసాయ శాఖ లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతానికి 452 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

దరఖాస్తు చేసుకునే విధానం

ఏపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్) పథకం ద్వారా రాయితీపై డ్రిప్, స్ప్రింకర్ల పరికాలు పొందాలనుకునే రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ కార్డు, భూమికి సంబంధించిన వన్‌బీ, గ్రామ రెవెన్యూ పటం, రేషన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, బ్యాంకు సేవింగ్ ఖాతా పుస్తకం, ఎస్సీ, ఎస్టీ వారైతే కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని వెళితే వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారు. రైతు చెల్లించే వాటా సొమ్మును పీడీ ఏపీఎంఐపీ, విజయనగరం వారిపేరు మీద ఆన్‌లైన్ పేమెంట్ చేయాల్సి ఉంటుంది.

సందేహాల నివృత్తికి..

బిందు,తుంపర సేద్యం పరికరాలు అమర్చిన తర్వాత హెడ్ కంట్రోల్ యూనిట్, వాల్వులు, డ్రిప్‌లు, స్ప్రింకర్లు, తదితర పరికరాల పనితీరులో సమస్యలుంటే పరిష్కారానికి, సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 18004252960ను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో కలిగే లాభాలు

- డ్రిప్ ఇరిగేషన్(బిందు, తుంపర సేద్యం) విధానంలో పంటకు నేరుగా పైపులద్వారా నీరు పంపించడం వల్ల నీటి వృథాను అరికట్టవచ్చు. పొలంలో గట్లు, కాల్వలు, మడులు వేయాల్సిన అవసరం ఉండదు.
- సాగునీరు ఆదా, భూగర్భజల వనరులను, విద్యుత్‌ను పొదుపు చేయవచ్చు.
- ఇసుక నేలలు, ఎగుడు,దిగుడు భూముల్లోనూ పంటలు సాగుచేయవచ్చు.
- పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం వల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడులు సాధారణం కంటే 5 నుంచి 20 శాతం వరకు అదనంగా వస్తాయి.
- స్ప్రింకర్ల నుంచి వెలువడే మృదువైన నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరు నిల్వ ఉండదు, మట్టి గడ్డకట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంటదిగుబడి కూడా పెరుగుతుంది.
- డ్రిప్ ద్వారా మొక్క, వేరు వ్యవస్థకు నేరుగా నీరు అందించడం వల్ల కలుపు తక్కువగా ఉంటుంది. తద్వారా కూలీల ఖర్చు తగ్గుతుంది.
- ఎరువులను సైతం డ్రిప్ పరికరాల ద్వారా పంటకు అందించవచ్చు. డ్రిప్ పైపుల్లో ఎరువును పంపిస్తే పంట మొత్తానికిఎక్కువ లేదా తక్కువ కాకుండా అందుతుంది. తద్వారా ఎరువుల వృథాని అరికట్టవచ్చు.
- మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్ పామ్, సపోట, బొప్పాయి, జామి, చెరకు, అరటి, పత్తి, మల్బరీ, కూరగాయలు, తదితర పంటలకు ఈ విధానం ఎంతో మేలు.

సద్వినియోగం చేసుకోవాలి



బిందు, తుంపర సేద్యం పరికరాలను ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరికరాలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు. జిల్లాలో మార్చినాటికి 3,050 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. – పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ, ఏపీఎంఐపీ పీడీ,విజయనగరం

అపూర్వ కలయిక



గంట్యాడ ఉన్నత పాఠశాలలో 1983–1988 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆపాఠశాల సమీపంలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. మూడున్నర దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులంతా పరస్పరం యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి అడిగితెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పటిలో వారికి చదువుచెప్పిన గురువులను సన్మానించారు. – గంట్యాడ

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో చాలా వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, మంచులో తిరగవద్దని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ సూచించారు. గజపతినగరం మండలంలోని శ్రీరంగరాజపురం లో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బందితో కలిసి 47 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు.అవసర మైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. – గజపతినగరం

నాట్లు వేయకుండానే...



కోతకు సిద్ధంగా ఉన్నట్టున్న ఈ వరి చేను గంట్యాడ మండలంలోని నీలావతి గ్రామంలో కనిపించింది.సాధారణంగా వరి నాట్లు వేస్తే మూడు, నాలుగు నెలల తర్వాత పంట పండుతుంది. కానీ నాట్లు వేయక పోయినా ఈ పొలంలో పంట పండింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరిపంటను ఎన్నడూ లేని విధంగా కోత దశలో రెల్లరాల్చు పురుగు ఆశించింది. దీంతో కోతకు ముందే పొలంలో ధాన్యం రాలిపోయాయి. ఆ తర్వాత కురిసిన వర్షాలకు ఇవి మొలకెత్తాయి.నాట్లు వేసి సాగు చేసిన పంట మాదిరిగానే చేనంతా కంకులతో కనబడుతోంది. – గంట్యాడ

ఇదేం పద్ధతి..!



బానాది సచివాలయం నుంచి రైతు సేవాకేంద్రానికి సామగ్రితో వస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, టీడీపీ నాయకులు

వేపాడ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనతో పాటు పౌరసేవలను అందుబాటులోకి తెచ్చింది. లక్షల రూపాయల ఖర్చుతో సిబ్బంది సజావుగా విధులు నిర్వహించేందుకు వీలుగా సచివాలయ భవనాలను నిర్మించింది. అక్కడ సిబ్బంది ప్రశాంతంగా పనిచేస్తున్నారు. ఇది కూటమి నాయకులకు నచ్చలేదు. వేపాడ మండలం బానాది గ్రామంలోని సచివాలయాన్ని బలవంతంగా ఖాళీ చేయించేశారు. ఇరుకుగా ఉన్న పంచాయతీ భవనంలోకి (ప్రస్తుత రైతు సేవాకేంద్రం(ఆర్‌బీకే)) సామగ్రిని మార్చారు. అక్కడే పనిచేయాలంటూ సిబ్బందికి హుకుంజారీచేసి తమ పంతం నెగ్గించుకున్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పర్యవేక్షణలో సోమవారం సాగిన ఈ తంతును చూసిన ఊరి జనం నవ్వుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవీ తమ సిబ్బందితో బందోబస్తు విధులు నిర్వహించారు.

నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్‌ఈ లక్ష్మణరావు

చీపురుపల్లి: విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఉద్యోగులు, సిబ్బంది పని చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ మువ్వల లక్ష్మణరావు సూచించారు. పట్టణంలోని రాధామాధవ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఆర్‌ఈసీఎస్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల ఉద్యోగులు, సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల్లో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వినియోగదారుల కు సత్వర సేవలు అందించడంలో ముందుండాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. సంస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సిబ్బంది, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.త్రినాథరావు, ఆర్‌ఈసీఎస్ ఎండీ పి.రమేష్, డీఈఈ బి.వి.రమణ, చీపురుపల్లి ఏఈ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించలేని పదవులెందుకు..?

- తాము గౌరవం కోసం పని చేస్తున్నాం
- ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ తీరుపై వార్డు మెంబర్లు అసహనం



మాట్లాడుతున్న వైస్ సర్పంచ్ మోపాడ కుమార్

శృంగవరపుకోట: తాము గౌరవం కోసం పని చేస్తున్నామని పంచాయతీలో చేసే పనులు, ప్రతిపాదనల గురించి చెప్పాల్సిన అవసరం లేదా అంటూ ఎస్.కోట మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు సర్పంచ్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ సంతోషి కుమారి అధ్యక్షతన, ఈఓ అనూరాధ నేతృత్వంలో పంచాయ తీ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. గత రెండు దఫాలు వాయిదా పడ్డ సమావేశం ఈసారి సజావుగా సాగింది. సభలో వైస్ సర్పంచ్ మోపాడ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని, వార్డు సభ్యులకు కనీస గౌరవం, సమాచారం ఇవ్వకపోవడం వల్లనే గత రెండు సమావేశాలు బహిష్కరించామ ని తెలిపారు. పంచాయతీలో చేసే పనుల గురించి, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు వార్డు మెంబర్లకు సర్పంచ్ కనీస సమాచారం ఇవ్వకపోతే తాము వార్డు మెంబర్లుగా ఉండి దేనికని ప్రశ్నించారు. వార్డులో ప్రజల సమస్యల ను పరిష్కరించ లేకుంటే ఈ పదవి ఎందుకు అంటూ నిలదీశారు.వార్డుమెంబర్ కాపుగంటి వాసు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం తొమ్మిది అంశాలతో పొందిపరిచిన అజెండాను సర్పంచ్ సభ ముందు ఉంచారు.ఇంటిపన్నులు, జనన–మరణాలు, మార్కెట్, కబేళా, సులభ్ కాంప్లెక్స్, వారపు సంతలకు అప్‌సెట్ ప్రైస్ ఆమోదం, టెండర్లకు పత్రికా ప్రకటన, గ్రంథాల య భవనం ప్లాన్ అప్రూవల్ అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. రేగ పుణ్యగిరికి రోడ్డు నిర్మాణం కోసం తీర్మానం చేసి ఇవ్వాలన్న ఈఓ ప్రతిపాదనను సభ్యులు అనుమతించారు. శివరాత్రి జాతరకు నిధుల కేటాయింపుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని తీర్మానించారు. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న ప్లాన్ అప్రూవల్స్, జమా,ఖర్చులు, కొత్త ట్రాక్టర్ కొనుగోలు అంశాలను ఆమోదించలేదు. సర్పంచ్ సంతోషికుమారి మాట్లాడుతూ వార్డులో చేసే పనులకు సంబంధించిన సమాచారం ముందుగా చెబుతామని, అందరూ సమన్వయంతో పట్టణాభివృద్ధికి సహకారం అందించాలని సభ్యులను కోరారు.పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేము అర్హులం కాదా..?



కుల ధ్రువీకరణ పత్రాలను చూపిస్తున్న గిరిజన సంఘం నేతలు

శృంగవరపుకోట: ''ప్రభుత్వం చదువుకొమ్మని చెబుతోంది. చదువుకున్నాక ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం వెళ్తే మమ్మల్ని గిరిజనులు కాదు పొమ్మంటున్నారు.ఇదెక్కడి న్యాయం..?''అంటూ ఏపీ గిరిజన సంఘం నేతలు సోమవారం ధ్వజమెత్తారు. సంఘ నాయకులు జె.గౌరీష్, చిన బాబు తదితరులు ఎస్.కోటలో మాట్లాడుతూ ఎస్.కోట, వేపాడతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో గిరిజనులకు షెడ్యూల్ ట్రైబ్ సర్టిఫికెట్, 1970 అమెండ్‌మెంట్ యాక్ట్ ప్రకారం కుల ధ్రువీకరణ పత్రం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అనుమతించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా గిరిజన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తే అభ్యంతరం చెప్పడం లేదని, రాష్ట్ర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటే షెడ్యూల్డ్ ట్రైబ్ కాదని చెబుతున్నారన్నారు. ఏటీబీ సర్టిఫికెట్ తెచ్చుకుంటేనే ఉద్యోగాలకు అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారని, ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న కానిస్టేబుల్ ఎంపికల్లో చాలా మంది గిరిజన అభ్యర్థులు నష్టపోయారన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ ఏం చేస్తోందో తెలియడం లేదన్నారు. అధికారులు గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి సూర్యనమస్కారాలపై శిక్షణ

శృంగవరపుకోట: రథసప్తమి పర్వదినా పురస్కరించుకుని స్థానిక మోక్షవిద్య యోగమందిర్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నారు. సూర్యనమస్కారాలపై 21వ తేదీ నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు శీలా కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు 99893 68781, 98667 57311 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పండగ అయిపోయింది.. పదండి పదండి



తిరుగు ప్రయాణం కోసం బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

చీపురుపల్లి: పండగ అయిపోయింది..ఇక పదండి పదండి అంటూ బ్యాగులు, పెట్టెలు పట్టుకుని పిల్లలను తీసుకుని దూర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు గ్రామాల నుంచి బయలుదేరుతున్నారు. కూలిపనులకు వలసపోయిన వారు, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సంక్రాంతి పండగకు వచ్చి తిరుగుపయణం అవుతుండడంతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు, రైల్వేస్టేషన్ కిటకిటలాడుతు న్నాయి. భోగికి ముందు కనిపించిన రద్దీనే తిరిగి ఇప్పుడూ కనిపిస్తోంది. చీపురుపల్లి ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, రాజమండ్రి వంటి ప్రాంతాలకు వెళ్లే వారంతా బ్యాగులు, పెట్టెలతో బస్సులు ఎక్కేందుకు కష్టాలు పడుతున్నారు. చీపురుపల్లి నుంచి విశాఖపట్నానికి డైరెక్ట్ బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. చీపురుపల్లి నుంచి రాజాం వెళ్లే రోడ్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) పనులు నత్తనడకన సాగుతుండడంతో ఈ ఏడాది సంక్రాంతి సమయంలో కూడా ఆర్టీసీ బస్సుల కోసం అవస్థలు పడక తప్పలేదని పలువురు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌ఓబీ వంతెన పనులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందే 80 శాతం పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినప్పటికీ మిగిలిన పను లు ఇంత వరకు పూర్తి కాలేదు. దీంతో విశాఖపట్నం వెళ్లే బస్సులు పునరుద్ధరణ కాకపోవడంతో చీపురుపల్లి నుంచి విజయనగరం వరకు పల్లె వెలుగు బస్సులు ఎక్కి అక్కడి నుంచి మళ్లీ బస్సులు మారి వెళ్లాల్సి వస్తోంది.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగించుకోండి

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగించుకోవాలని చీపురుపల్లి, గజపతినగరం పశు సంవ ర్ధక శాఖ ఏడీలు డాక్టర్ ఆర్.శారద, డాక్టర్ చంద్రశేఖర్, పలువురు పశువైద్యాధికారులు సూచించారు. ఈనెలాఖరు వరకు నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరాలు చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. పశువులకు సాధా రణ వైద్య పరీక్షలతో పాటు గర్భ కోశవ్యాధి పరీక్షలు చేసి నట్టల నివారణ మందులు వేశారు. పశువులకు ఎద ఇంజెక్షన్‌లు, గొర్రెలకు షీప్ పాక్స్, మేకలకు గోట్ పాక్స్ వ్యాక్సిన్‌లు వేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. – సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: గొల్లలపేటలో మేకలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ శారద



చీపురుపల్లిరూరల్(గరివిడి): అర్తమూరులో పాడి రైతులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ కుమార్



బొండపల్లి: బిల్లలవలసలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్



గజపతినగరం: ఎం.గుమడాంలో పాడిరైతులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్న ఏడీ చంద్రశేఖర్



మెరకముడిదాం:సోమలింగాపురంలో పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ హైమావతి